

కథ

హోతా పద్మినీదేవి

# చెవిలో జోరీగ

"మరికొంచెం అన్నం కలుపుకో. కోడి కెలికినట్టు అదేం తిండిరా?" పళ్ళెంలో మరింత కూర వడ్డిస్తూ అంది సంధ్య.

"చాలమ్మా!" అన్నం కలిపి ముద్ద నోట్లో పెట్టుకున్నాడో లేదో డైనింగ్ టేబిల్ మీద చేతికి అందేంత దూరంలో అతను పెట్టిన సెల్ఫోను మోగింది.

డిస్ప్లేలో నెంబరు చూసి వెంటనే ఆన్ చేసాడు రవి. "హలో!"

ఫోన్లో అవతలి వ్యక్తి ఏం చెప్పాడోగానీ అతని ముఖం ఆందోళనతో నిండిపోయింది. వెంటనే అన్నం ముందు నుంచి లేచేసాడు.

"అమ్మా! వర్మకి సీరియస్గా వుందిట నేను వెంటనే వెళ్ళాలి"

"అయ్యో!" షాకయిపోయింది సంధ్య. ఆమె తేరుకునేలోగానే రవి వాష్బేసిన్ దగ్గర చెయ్యికడిగేసుకున్నాడు.

"కాస్త మజ్జిగన్నం తిని వెళ్ళు నాన్నా!" ఎలాగో నోరుపెగల్చుకుని అంది.

"లేదమ్మా!" రవి బైక్ కీస్ అందుకున్నాడు. మొబైల్ తీసుకెళ్ళడం మరచిపోలేదు.

నిండుకంచాన్ని, సింక్లో పడేసి అసహాయంగా నిట్టూర్చింది సంధ్య. భోజనం చేసేప్పుడు ఫోన్ మాట్లాడకు అంటే వినడు. ఉత్తరాల కోసం పోస్ట్మేన్ కోసం ఎదురు చూసే స్వర్ణయుగం గుర్తొచ్చిందామెకి. సరిగ్గా ఇంట్లో అందరూ భోజనం చేసేవేళ పోస్ట్మేన్ వచ్చేవాడు. భోజనం చేసేప్పుడు తల్లి ఉత్తరాలని చదవనిచ్చేది కాదు. ఏ ఉత్తరం ఏ దుర్వార్తని మోసుకొస్తుందోనని భయం ఆవిడది.

ఇంటింట టెలిఫోన్లు వచ్చాక తోకలేనిపిట్ట తోక తెగిన పిట్ట అయిపోయింది. ఉత్తరాలు రాయడానికి బద్ధకం. ఎప్పుడు కావలిస్తే అప్పుడు ఫోన్లో పలకరించుకోవడమే.

కార్డ్లెస్ ఫోను ఎడమచెవికి భుజానికి మధ్య నొక్కిపట్టి వంట చేస్తూ పిల్లల చేత హోమ్వర్కు చేయిస్తూ ఫోన్లో మాట్లాడుతూనే వుండేవాళ్ళని ఎంతమందిని చూడలేదు. సెల్ఫోన్ వచ్చాక పరిస్థితి మరీ ఘోరంగా తయారయింది. సెల్ ఫోను కాదది. చెవిలో జోరీగ.

చెప్పులోని రాయి చెవిలోని జోరీగ
కంటిలోని నలుసు కాలి ముల్లు
ఇంటిలోని పోరు ఇంతింత గాదయా-

వేమన శతకంలోని పద్యం అప్రయత్నంగానే గుర్తొచ్చింది సంధ్యకి.

వేమన ఇప్పుడు కనుక ఆ పద్యాన్ని రాసివుంటే 'చేతిలోని సెల్లు' అనే పదాలని చేర్చి వుండేవాడేమో!

అవసరం వున్నవాళ్ళకి లేనివాళ్ళకి శ్రీ మహావిష్ణువు చేతిలో శంఖచక్రాల్లా సెల్ఫోను హస్తభూషణమయిపోయింది. భోజనం చేస్తూ డ్రైవింగ్ చేస్తూ ఆఖరికి స్నానం చేస్తూ కూడా సెల్ఫోన్లో మాట్లాడ్డమే. డిస్ప్లేలో నెంబరు చూడ్డం, ఇష్టమయితే ఫోను ఆన్సర్ చెయ్యడం లేకపోతే కాల్ని కట్ చెయ్యడం.

సంధ్య భర్త కిషోర్ ఉద్యోగరీత్యా మస్కట్లో వుంటున్నాడు. రవి చదువుకోసం ఆమె హైదరాబాద్లో వుండక తప్పలేదు. రవి ఇంజనీరింగ్ ఫైనలియర్ చదువుతున్నాడు. కాలేజీ ఇంటికి చాలాదూరం అవడంవల్లనైతేనేమి రెండు బస్సులు మారి కాలేజీకి వెళ్ళడం కష్టమని బైక్, కమ్యూనికేషన్ కోసం సెల్ఫోను కొనివ్వక తప్పలేదు వాడికి.

కొడుకు అన్నం తినకుండా వెళ్ళాడని ఆమెకి కూడా అన్నం తినబుద్ధి కాలేదు. ఒకవైపువర్మ ఎలా వున్నాడోనని ఆందోళన. మరి కాస్సేపటి తర్వాత ఇంక వుండబట్టలేక రవి సెల్కి కాల్ చేసింది.

"వర్మ..." ఎలా అడగాలో అర్థం కాలేదు.

"అరగంట క్రితమే పోయాడమ్మా!" రవి గొంతులో దుఃఖం. వెనుక లీలగా చనిపోయినతని బంధువుల రోదనలు విన్పిస్తున్నాయి.

సంధ్య గుండె వేగం అమాంతం పెరిగిపోయింది.

"అయామ్ సారీ నాన్నా! నువ్వు జాగ్రత్త!" అని ఫోన్ పెట్టేసింది.

వర్మ ముఖం ఆమె కళ్ళముందు మెదులుతోంది. రవితోబాటు ఒకటి రెండుసార్లు ఇంటికి వచ్చాడతను. నిండా ఇరవైఏళ్ళు లేని అతనికి అప్పుడే నూరేళ్ళు నిండిపోవడం సంధ్య మనసుని కలచివేస్తోంది.

రాత్రి పదిగంటలకి ఇంటికొచ్చిన రవి ముఖం పీక్కుపోయి వుంది. వాడు స్నానం చేసి వచ్చాడు. తల్లి బలవంతం వేస్తే కాస్త మజ్జిగన్నం తిన్నాడు.

"ఎలా జరిగిందిరా?" అడగలేక అడిగింది.

"బైక్ మీద వాళ్ళ గెస్ట్ హౌస్ నుంచి వస్తూ సెల్ఫోనులో ఫ్రెండ్తో మాట్లాడుతున్నాడు. లారీ గుద్దేసి..." రవి గొంతు రుద్ధమయింది.

"భగవంతుడా!" సంధ్య వేదనగా నిట్టూర్చింది.

"ఫోన్ మాట్లాడుతూ బైక్ డ్రైవ్ చెయ్యడమేమిటి? అంత మాట్లాడాలనుకుంటే బైక్పక్కకి ఆపి మాట్లాడ వచ్చుగా?" రవిని పూరడిస్తూ ఎట్టి పరిస్థితులలోను బైక్ డ్రైవ్ చేస్తూ సెల్ఫోనులో మాట్లాడవద్దని మరీ మరీ చెప్పింది.

* * *

సంధ్య కూరలు కొనుక్కోడానికి బయలుదేరింది. తలుపుతాళం పెడుతూవుంటే పక్క ఫ్లాట్లో వుండే ప్రమీల పలకరించింది నవ్వుతూ.

"షాపింగ్కా?"

"కూరలకోసం"

"నేనూ వస్తాను. అయిదు నిముషాలు ఆగుతారా?"

"సరే" అంది సంధ్య.

ప్రమీల పర్సు, బిగ్ షాపర్ తీసుకొని వచ్చింది.

"మీ వారెప్పుడొస్తారు?" అడిగింది ప్రమీల.

"ఇంకో ఆరునెలల తర్వాత" నవ్వింది సంధ్య.

"బాబోయ్! మీరు ఎలా వుంటున్నారో గాని, మా వారు నెలకోసారి కేంపుకెళ్తేనే నాకు తోచదు.."

"ఏం చేస్తాం? తప్పదు. మా అబ్బాయి ఎమ్ఎస్ చెయ్యడానికి అమెరికా వెళ్తానంటున్నాడు. అప్పటివరకు నేనిక్కడ...ఆయనక్కడ..." నవ్వింది.


ఇద్దరూ ఆటో ఎక్కారు.

* * *

రెండు రోజుల తర్వాత రవి పుట్టినరోజని వాడికి బట్టలు కొనడానికి హైదరాబాద్ సెంట్రల్కి వెళ్ళింది సంధ్య. కాలేజీనుంచి నేరుగా అక్కడికి వచ్చివున్నాడు రవి. వాడికినచ్చిన బట్టలని సెలెక్టు చేసుకుని ట్రయల్ రూమ్లోకి వెళ్ళాడు.

ఇంతలో అక్కడికి వచ్చిన చక్రవర్తిని చూసి సంధ్య నిటారుగా అయింది. ప్రమీల అతని భర్త కేంపు కెళ్ళాడని నాలుగు రోజుల దాకా రాడని క్రితం రాత్రే చెప్పింది. ఆమె ఆశ్చర్యానికి కారణం అదే చక్రవర్తి పక్కన ఆధునికంగా అలంకరించుకున్న ఒక

యువతి. అతని చెయ్యి ఆమె నడుముని చుట్టివుంది. అతను సంధ్యని అక్కడ చూసినట్టు లేదు. అతను తనని చూస్తాడేమో అనే సందేహంతో సంధ్య పక్కకి తప్పుకుంది. ఆమెలో ఏదో ఆసక్తి వాళ్ళని గమనించేలా చేసింది.



చక్రవర్తి చేతిలోని సెల్‌ఫోను మోగింది.

"ఆ! చెప్పు ప్రమీ! ఇప్పుడే కాన్ఫరెన్సు అయింది. హోటల్‌కి వెళ్ళబోతున్నాను"

"ఆ! ఏం భోజనంలే! గడ్డి! ఇంటికెప్పుడొస్తానా నీ చేతి కమ్మని వంట ఎప్పుడు తింటానా అని ఆత్రుతగా వుంది. ఐ మిస్ యు డార్లింగ్!" ఆ యువతి వైపు కొంటెగా చూస్తూ అంటున్నాడతను.

ఆమె సరసంగా అతని చెంపమీద తట్టి నవ్వింది.

ఆడ, మగల మధ్య స్నేహాన్ని అపార్థం చేసుకునే కుసంస్కారి కాదు సంధ్య. కానీ, చక్రవర్తికి ఆ యువతికి మధ్యవున్న సాన్నిహిత్యం కాన్ఫరెన్సు నుంచి హోటల్‌కి వెళ్ళబోతున్నానని అతను అబద్ధం చెప్పడంతో అతను ప్రమీలని మోసం చేస్తున్నాడని స్పష్టమయింది. 'కేంపు కెళ్తున్నానని భార్యని నమ్మించి మరో అమ్మాయితో షాపింగ్‌కి వచ్చిన అతను! ఇంతకీ ఎవరామె? అతని ఆఫీసులో పనిచేసే అమ్మాయా? లేక కాల్‌గర్లా? పాపం! ప్రమీల! నిజంగా తన భర్తకేంపులో వున్నాడని నమ్ముతోంది. మొబైల్ ఫోనులో మాట్లాడ్డం వల్ల అతను ఎక్కడనుంచి మాట్లాడుతున్నాడో చెప్పడం ఎలా సాధ్యం? ఊళ్ళోనే వుండి కేంపునకు వెళ్ళానని ఎంత సులువుగా నమ్మిస్తున్నాడు.' పరధ్యానంగానే రవి సెలెక్టు చేసుకున్న బట్టలకి బిల్లు చెల్లించి బయటపడింది.

రవి కాలేజీ నుంచి నేరుగా షాపింగ్‌కి వచ్చాడని, టిఫిన్ తినలేదని వాడిని దారిలో ఏదైనా రెస్టారెంటు దగ్గర బైక్ ఆపమంది.

రెస్టారెంటులో రవికి స్నాక్స్, తనకి కాఫీ ఆర్డరిచ్చి అప్రయత్నంగానే చుట్టూ చూసింది. పక్క టేబిల్ దగ్గర కూల్‌డ్రింక్ తాగుతున్న అమ్మాయి సెల్ ఫోనులో మాట్లాడుతోంది.

"ఇవాళ స్పెషల్ క్లాసువుంది మమ్మీ! కాస్త లేటుగా వస్తాను"

అటువైపునుంచి ఆ తల్లి ఏమందోమరి.

"అబ్బ! క్లాస్‌లో వున్నాను. ఇంటికొచ్చి మాట్లాడతాగా?" తన కెదురుగా కూర్చున్న జులపాల జుట్టు అబ్బాయి వైపు చూసి నిక్కచ్చిగా కన్నుగీటుతూ సెల్ ఆఫ్ చేసింది.

సంధ్య ఒళ్ళంతా చెమటలు పట్టేసాయి. రోజూ అయిదింటికి ఇంటికొచ్చే కూతురు ఇంకా ఇంటికి రాలేదని ఆమె తల్లి కంగారుపడి ఫోన్ చేసి వుంటుంది. బాయ్‌ఫ్రెండ్‌తో రెస్టారెంటులో కూర్చుని వున్న ఈ పిల్ల కాలేజీ అని, స్పెషల్ క్లాసని ఎంత ధైర్యంగా అబద్ధం చెబుతోంది?

"ఏమిటమ్మా! కాఫీ, తాగకుండా ఆలోచిస్తున్నావ్? ఆ అమ్మాయి అబద్ధం చెబుతోందనా? బాయ్‌ఫ్రెండుతో రెస్టారెంటులో వున్నానని చెప్తే వాళ్ళమ్మ వూరుకుంటుందా? పోనీ నువ్వు వూరుకుంటావా?" అన్నాడు రవి నవ్వుతూ.

సంధ్య భయంగా కొడుకు వైపు చూసింది.

* * *

సెకండ్ ఫ్లోర్‌లో వుంటున్న బ్యాంక్ మేనేజరు సత్యన్నారాయణగారి మనవడి అన్నప్రాశన అని పిలిస్తే వెళ్ళింది సంధ్య. పదినెలల పసివాడు ఎదురుగా వున్న పూలు, పళ్ళు, పుస్తకాలు, పెన్నులు బంగారు ఆభరణాలు వెండి వస్తువులని వదిలి, పూజ చేయించడానికి వచ్చిన పురోహితుడు తన పక్కన పీటమీద పెట్టుకున్న సెల్‌ఫోనుని పట్టుకున్నాడు.

ఆహూతులంతా ఒక్కసారిగా ఫక్కున నవ్వేరు.

"వీడు కంప్యూటర్ యుగంలో పుట్టిన పిల్లాడు. అందుకే సెల్ ఫోను, పట్టుకున్నాడు" అన్నాడు పురోహితుడు వాడి తలమీద అక్షింతలు వేసి ఆశీర్వదిస్తూ.

తమ చిరంజీవి ఏదో ఘనకార్యం చేసినట్టు మురిసిపోతూ వాడిని గుండెలకి హత్తుకున్నారు వాడి తల్లిదండ్రులు.

సంధ్య పసివాడి చేతులలో తను తెచ్చిన గిఫ్టుని వుంచి అక్షింతలు వేసి బయటకి నడిచింది.

ప్రస్తుతకాలంలో సెల్ ఫోను ఉపయోగించని మనిషి లేదు. కమ్యూనికేషన్ వ్యవస్థ దూరాలని చెరిపేసిన మాట వాస్తవమే. కానీ, సెల్ ఫోనుని సక్రమంగా ఉపయోగించుకోకపోవడం వలన ఎన్ని అనర్థాలు? భారంగా నిట్టూర్చింది సంధ్య.

★